తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

నిజాంపేట్: అదృశ్యమైన బాలుడిని బాచుపల్లి పోలీసులు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన అప్పన్న, కృష్ణవేణి కుమారుడు కిరణ్‌సాయి (13) ఈ నెల 8న ఉదయం 6.30 గంటలకు చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి బాలుడి కోసం గాలింపు చేపట్టారు. ఖైరతాబాద్ వినాయకుడి వద్ద కిరణ్‌సాయి ఉన్నట్లు గుర్తించి పోలీసులు అదే రోజు రాత్రి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. గణేశుడిని చూసేందుకు వెళ్లినట్లు కిరణ్‌సాయి తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన బాచుపల్లి పోలీసులను కూకట్‌పల్లి ఏసీపీ అభినందించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న బాచుపల్లి పోలీసులు

చెరువులు కళకళ..


కొత్తకుంట చెరువు


కాయిదమ్మకుంట కోనేరు

చందానగర్: వినాయక చవితి పండగను పురస్కరించుకొని చందానగర్ సర్కిల్– 21 పరిధిలో గణనాథుల విగ్రహాల నిమజ్జనం కోసం కోనేరులను శుభ్రం చేస్తున్నారు. సర్కిల్ 21 పరిధిలో 6 నిమజ్జనం పాయింట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. 3 కోనేరులు, రెండు చెరువులు, ఒక బేబీపాండ్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

నిమజ్జన ప్రాంతాలివే..

చందానగర్ సర్కిల్ –21 పరిధిలో చందానగర్ గంగారం పెద్ద చెరువు, హఫీజ్‌పేట్‌లోని కాయిదమ్మకుంట చెరువు, దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట, మియాపూర్ గురునాథం చెరువుల వద్ద కోనేరులు, కొత్తకుంట చెరువులలో కేవలం మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనం, చందానగర్ పీజేఆర్ స్టేడియంలో తాత్కాలికంగా చిన్న విగ్రహాల కోసం ప్రత్యేకంగా బేబి పాండ్ ఏర్పాటు చేస్తున్నారు.

- చందానగర్ సర్కిల్ పరిధిలోని కోనేరుల వద్ద కనీస వసతులు, నిమజ్జన ఏర్పాట్లు కొరకు రూ.42 లక్షలు
- వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కోనేరులలో బోర్ల ద్వారా, ట్యాంకర్ల ద్వారా మంజీరా నీటితో నింపుతున్నారు.
- పెద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గంగారం చెరువు వద్ద రెండు, కాయిదమ్మకుంట వద్ద రెండు, కొత్తకుంట వద్ద ఒకటి, గురునాథం చెరువు వద్ద ఒక్క క్రేన్‌ను ఉంచనున్నారు.
- కోనేరుల వద్ద విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేస్తున్నారు.
- భక్తుల కోసం గంగారం కోనేరు వద్ద ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు.
- జీహెచ్‌ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సూపరింటెండెంట్‌లతో ఎప్పటికప్పుడు నిమజ్జనాన్ని పర్యవేక్షించడానికి టీంలను ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కోనేరు వద్ద చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక వాహనాలలో డంప్‌యార్డుకు తరలింపు
- పోలీసులతో ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద ఎస్ఐ, ఏఎస్ఐ స్థాయి అధికారులతో కట్టుదిట్టమైన భద్రత
- ఈ నెల 7వ తేదీ నుంచి నిమజ్జనాలు ప్రారంభమై 17న ముగుస్తాయి.


గంగారం పెద్ద చెరువు వద్ద భారీ క్రేన్

వసతులు ఏర్పాటు



చందానగర్ సర్కిల్ పరిధిలో 6 నిమజ్జనం పాయింట్లు ఉన్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. కోనేరుల వద్ద వసతులు, భారీ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 24 గంటల పాటు జీహెచ్‌ఎంసీ సిబ్బందిని అందుబాటులో ఉంటారు.

–మోహన్‌రెడ్డి, ఉప కమిషనర్, సర్కిల్ 21 చందానగర్

కట్టుదిట్టమైన భద్రత



కాలనీలలో ఏర్పాటు చేసే గణనాథుడి సమాచారం తప్పనిసరిగా పోలీసులకు అందించాలి. ప్రతి మండపానికి జియో ట్యాగింగ్ చేస్తున్నాం.చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారం చెరువు, పీజేఆర్ స్టేడియం, నల్లగండ్ల, గోపినగర్ చెరువుల నిమజ్జనం పాయింట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు భద్రత ఏర్పాటు చేస్తున్నాం. – పాలవెల్లి, ఎస్‌హెచ్‌ఓ, చందానగర్ పోలీస్‌స్టేషన్


గంగారం పెద్ద చెరువు వద్ద మొబైల్ టాయిలెట్స్

రేపటి నుంచి శ్రీ మద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకరమఠంలో ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకుశ్రీ మద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శంకరమఠం ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 బుధవారం బ్రహ్మశ్రీ డాక్టర్ మద్దుల పల్లి దత్తాత్రేయ శాస్త్రిచే శ్రీ మద్భాగవత మహోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గోపిశెట్టి నిరంజన్

మోతీనగర్: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు చిహ్నాలని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ గోపిశెట్టి నిరంజన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి ఆశీస్సులతో రాబోయే రోజుల్లో ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ వీఎన్‌వీ సత్యనారాయణ, ఆలయ కార్య నిర్వాహణ అధికారి జీపీకే కృష్ణ గోపిశెట్టి నిరంజన్‌ను సన్మానించారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

మూసాపేట: మూసాపేట భరత్‌నగర్‌లో శక్తి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వెంపటి కూచిపూడి నృత్య అకాడమీ వారు చేసిన రామాయణం, కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. గురువు వెంపటి లక్ష్మణ కుమార్ శిష్య బృందం మైలవరపు శిరీష, సుచిత్ర క్రాంతి, యోషిత, మనోజ్ఞతో పాటు చిన్నారి కళాకారులు అద్భుతమైన అంశాలను ప్రదర్శించారు. నిర్వాహకులు చిరంజీవి రెడ్డి, పాండు రంగారెడ్డి, సాయికృష్ణ, ప్రసాద్, అప్పారావు, రాజశేఖర్‌రెడ్డి కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

హక్కులను సాధించుకోవాలి

మూసాపేట: బీసీ నాయకులు అందరు ఐక్యంగా పోరాటం చేసి హక్కులను సాధించుకోవాలని టీపీసీసీ లేబర్ సెల్ కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షుడు సప్పిడి భాస్కర్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యను సోమవారం సప్పిడి భాస్కర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వెనుకబడిన హక్కుల కోసం తమ వంతు కలిసి పోరాడతామని అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, సప్పిడి వినీత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఆర్. కృష్ణయ్యను కలిసిన నాయకులు

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: దేశ భాషలందు తెలుగు లెస్స అన్న శ్రీ కృష్ణ దేవరాయలును స్ఫూర్తిగా తీసుకొని మనుగడ కొనసాగిస్తున్న మన తెలుగు భాష ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని కొనియాడబడింది. కాళోజి నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా తెలుగు భాషోపాధ్యాయ శాఖ, కూకట్‌పల్లి పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ తెలుగు మాతృభాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి తెలంగాణ భాషా గొప్పతనం, కాళోజి నారాయణ రావు జీవిత విశేషాలు విద్యార్థులకు సందేశ రూపంలో అందించారు. తెలుగు భాషా ఉపాధ్యాయులు డాక్టర్ మావి శ్రీమాణిక్యం మాట్లాడుతూ.. మన అస్తిత్వం, వారసత్వం, సంస్కృతికి ఊపిరిపోసేది మన మాతృభాష తెలుగు మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మీ, రామ్మోహన్‌రావు, సక్కుబాయి, నజీముద్దీన్, మల్లారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గాయత్రి శర్మ, గోపాల కృష్ణ, దామోదర్ రెడ్డి, ప్రవీణ్, శ్వేత పాల్గొన్నారు.

పంచశీల స్కూలులో

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో సోమవారం తెలంగాణ భాష దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భాషా విశిష్టత, కాళోజీ నారాయణరావు తెలంగాణ భాషా వ్యాప్తికి చేసిన సేవలు, కృషిని కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్‌పల్లి మండల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు కూకట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పుష్పారెడ్డి, మేకల రమేష్, మధుగౌడ్, గూడెపు నాగరాజు, సునీల్ యాదవ్, జ్యోతి, కృష్ణవేణి, ఎంఈఓ హరీష్ చంద్ర, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలో మంచినీటి సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ ప్రభాకర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, బి. శ్రీను మాట్లాడుతూ.. బస్తీలో కొన్ని ఇళ్లకు మంచినీటి కనెక్షన్లు లేవన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్‌లు కొత్తవి వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. అధికారులతో సర్వే చేయించి కనెక్షన్లు ఇస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. వినతి ఇచ్చిన వారిలో చంద్రశేఖర్, రాములు, సుధాకర్ ఉన్నారు.

ప్రారంభమైన నిమజ్జనాలు





ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువు నిమజ్జనాలతో కళకళలాడుతుంది. ఇళ్లల్లో ఏర్పాటు చేసుకున్న వినాయకులకు మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన నిమజ్జనం చేస్తున్నారు. సోమవారం నుంచి గణనాథులను నిమజ్జనం కోసం తరలి వస్తుండటంతో అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ రాజేందర్‌గౌడ్ ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య చెరువు కట్ట వద్ద నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ఐడీఎల్ చెరువు వద్ద..

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో సోమవారం వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. మూడవ రోజు కావడంతో ఇళ్ల, కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను చెరువులలో నిమజ్జనం చేశారు. చిన్నారులు బూరలు ఊదుతూ నినాదాలతో హోరెత్తించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే


గ్రాండ్ పేరెంట్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు, కుటుంబ సభ్యులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని రవీంద్ర భారతి పాఠశాలలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాత విలువలను ఆచరిస్తూ కొత్త విద్యా పద్ధతులను పాటిస్తూ విద్యార్థుల నవచైతన్యానికి, వికాసానికి మూలం నిదర్శనం రవీంద్ర భారత పాఠశాల అన్నారు. అదే విధంగా విద్యార్థుల అభ్యున్నతికి ప్రథమ కర్తవ్యం క్రమ శిక్షణ, మంచి నడవడిక అన్నారు.

ఆదిత్యనగర్‌లో..

ఆదిత్యనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పిల్లలు వారి తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ఇందిరి ప్రియదర్శిని మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు జరుపుకోవటంతో పిల్లలకు విలువలు, పెద్దలను ఎలా గౌరవించాలో తెలుస్తుందన్నారు.

నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌కు చెందిన గంగా సుబ్బారావు మరణించారు. విషయం తెలిసిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ సుబ్బారావు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శుభాకాంక్షలు

ఆల్విన్‌కాలనీ: ఇటీవల నియమితులైన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌ను సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏకాంత్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ గౌడ్, బొట్టు శ్రీను, వినోద్, భాస్కర్ పాల్గొన్నారు.



ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


వినోద్‌కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉండే ఎం వినోద్ కుమార్ (36) ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వినాయక చవితికి భార్య మంజూష దేవి పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వినోద్‌కుమార్ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్ యాప్ ద్వారా ఏమైనా అప్పులు తీసుకున్నాడా..? లేదా..? ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా..? అన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

చందానగర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలురు అదృశ్యమయ్యారు. చందానగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కిష్టయ్య తెలిపిన ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రమేష్ కుటుంబం ఫుట్‌పాత్‌పై ఉంటున్నారు. అతని కుమారుడు అరుణ్ (2) సోమవారం ఉదయం ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. ఈ మేరకు బాలుడి తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో..

చందానగర్ హుడా కాలనీలో ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సంధ్య తెలిపిన ప్రకారం .. సంకల్ప ఫౌండేషన్‌లో ఉండే లక్ష్మీవరప్రసాద్ (11) సోమవారం ఉదయం ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. బాలుడి ఆచూకీ కోసం ఫౌండేషన్ సభ్యులు గాలించినా లభించలేదు. దీంతో చందానగర్ పోలీసులను ఆశ్రయించారు.


బాలాజీనగర్‌లో మన అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకున్న కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి


మట్టిగణపతి పూజల్లో పాల్గొన్న కాలనీ వాసులు


వినాయకుడిని దర్శించుకున్న ఇన్‌స్పెక్టర్ ముత్తు, ఎస్ఐలు

బొజ్జ గణపయ్యకు నిత్య పూజలు


గణనాథుడికి పూజలు చేసిన శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు

కూకట్‌పల్లి నియోజకవర్గ జంటసర్కిళ్ల పరిధిలో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలకు నిత్య పూజలు కొనసాగుతున్నాయి. పలు కాలనీ, బస్తీల్లో సంక్షేమ సంఘాల నాయకులు, యువకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాలను ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆయా మండపాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. – కూకట్‌పల్లి జోన్ బృందం


మాధవినగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు


ఎస్సీ బస్తీలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్


ఓల్డ్ బోయిన్‌పల్లిలో గణనాథునికి పూజలు చేస్తున్న కూకట్‌పల్లి ముదిరాజు సంఘం అధ్యక్షుడు పిట్ల రాజు


వడ్డేర బస్తీలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు మక్కాల నర్సింగ్‌రావు